
అమెరికా తెలుగు సంఘం, అమృత్‌కిరణ్ సంయుక్తంగా నిర్వహించిన కథలపోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ


# కిరణ్‌గాడికి కోపమొచ్చింది...!



-వి.ఎస్. రవిచంద్ర

చీకటిపడుతోంది. స్కూలు మూసేసి చాలా సేపయ్యింది. అయినా పిల్లలు గ్రౌండులో ఆడుకుంటూనే ఉన్నారు. మూడు రాళ్ళు నిలబెట్టి క్రికెట్టో, మరో మూడు రాళ్ళు నిలబెట్టి బంతాటో మరొకటో మరొకటో ఆడుతూ బిజీగా ఉన్నారు.

కానీ పదేళ్ళకుర్రాడు ముటుకు ఎవ్వరితోనూ కలవకుండా దూరంగా ఒంటరిగా కూర్చున్నాడు. వాడిపేరుకిరణ్. వాడ్ని అందరూ 'కిరణ్‌గాడ'ంటుంటారు.



ఇప్పుడు వాడికో పెద్ద సమస్య వచ్చింది. తన దృష్టిలో అది ప్రపంచంలోని అన్ని సమస్యలకన్నా పెద్దది. ఇంతకీ వాడి పెన్ను పోయింది. అవును... వాడు వ్రాసుకునే పెన్ను పోయింది.

పైగా వాళ్ళమ్మ ఈరోజు, 'ఇది నాన్నగారు ఎమ్మే పరీక్షలు రాసిన పెన్ను - జాగ్రత్త పారేయకు' అంటూ మరీ మరీ చెప్పి పంపించింది.

ఇప్పుడది ఎక్కడో పడిపోయింది అదీ వాడి బాధ. అలాపోవడం మొదటిసారికాదు. నాలుగోదో ఐదోదో ఆవారంలో...

అసలెలా పోతున్నాయో, లేకపోతే ఎవరైనా కొట్టేస్తున్నారో వాడి చిన్ని బుర్రకి తట్టడం లేదు. వాళ్ళమ్మకూడా ఇదే విషయం అడుగుతుంది వాడ్ని పెన్ను పోయినప్పుడల్లా.

"అసలెలాపోతున్నాయ్‌రా ఇన్నిపెన్నులు? రాస్కున్న తర్వాత జాగ్రత్తగా జేబులో పెట్టుకోవా?" అని గద్దించి అడుగుతుంది.

కిరణ్‌గాడు మాట్లాడడు. కోపాన్ని దిగమింగి, పెదాలు బిగబెట్టి, కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా 'జాగ్రత్తగానే పెట్టుకుంటాన'న్నట్లుగా తలవూపుతాడు.

"మరి జాగ్రత్తగా ఉంచితే ఎలా పోతుంది? అసలు ఒంటిమీద స్పృహవుంటేగా వీడికి... లాగూ జేబుల్లో చేతులు పెట్టుకుని ఎగురుకుంటూ నడుస్తాడు. ఈలోగా ఆపెన్ను ఎక్కడో పడిపోతుంది." అని గదమాయించి తిప్పుతూ, మళ్ళీ ఏవనుకుంటుందో ఏంటో "వూ... సరిసర్లే ఏమన్నా అంటే ఏడుపు మొఖమొకటి- ఇవ్వాళ రాసుకోడానికేం లేదుగామరి" అంటూ అలమరా తీసి అందులోంచి కొత్తపెన్ను తీసిఇస్తుంది.

ఇచ్చేటప్పుడు ఇదిగూడా పారేయకు అని ఎన్నో జాగ్రత్తలు చెబుతుంది.

అప్పటివరకూ తిడ్తోన్న అమ్మవంక గుర్రుగా చూస్తోన్న కిరణ్‌గాడికి కొత్తపెన్ను చూడగానే ఎంత వద్దనుకున్నా ముఖం వికసిస్తుంది. వెంటనే తల్లి మాటలన్నింటికీ తలవూపి స్కూలుకి ఒక్కపరుగందుకుంటాడు.

కొత్తపెన్ను పట్టుకుని.

కాని సాయంత్రం మళ్ళీ మామూలే. ఎక్కడ పోతుందో తెలీదు. ఎలా పోతుందో తెలీదుకానీ పెన్ను మాత్రం వాడి దగ్గరవుండదు.

పోనీ ఎవరైనా దొంగతనంగా తీస్తున్నారా అంటే, రోజూ స్కూల్లో ఓ అరగంట కిరణ్‌గాడి పెన్ను వెతుకుడు కార్యక్రమం అనవాయితీ తప్పకుండా జరుగుతోందామె...! అయినా వాడు పెన్నులు ఎక్కడ పారేస్కుంటున్నాడో అటు వాళ్ళమ్మకీ, అడి మాస్టారికీ ఎవ్వరికీ అంతుపట్టట్లేదు ఒక వారం నుంచి.

అసలు వాడు సెకండుక్లాసుకి వచ్చిందగ్గర్నుంచీ వచ్చాయ్ సమస్యలు. పోనీ వచ్చాడుసరే, అసలు ఆ బండ వంశీగాడు జోకర్ బొమ్మున్న పెన్ను ఎందుకుతేవాలి, పోనీ తెచ్చాడుసరే, అమర్నాడునుంచీ ప్రతి ఒక్కడూ పెన్సిళ్ళు మానేసి, తలొక పెన్ను తెచ్చుకొని కిరణ్‌గాడి ముందెందుకు గొప్పలు కొట్లాట? అందుకే కిరణ్‌గాడికీ... కోపం వచ్చింది.

ఇంటి [illegible]నే వాళ్ళమ్మతో "ఈ రోజునుంచి నేను పెన్నుతోనే హోమ్‌వర్క్ చేస్తాను. పెన్నుతోనే స్కూల్లోకూడా రాసుకుంటాను. ఈ పొట్టి పెన్సిల్‌తో రాసుకో"అని చెప్పాడు రోషంగా ముక్కు పొంగించి.

వాడి హడావిడి చూసి ఏమయ్యిందని అడిగింది వాళ్ళమ్మ నవ్వాపుకుంటూ.

వంశీగాడు జోకర్ బొమ్మ పెన్ను తేవడం దగ్గర్నుంచీ, అందరూ పెన్నులు తెచ్చుకోవడం వరకూ అన్నీ చెప్పేసాడు వాళ్ళమ్మతో. ఏ ముఖానుంధో వాళ్ళమ్మ కూడా సరేనంది ఆ మాటకి. అదీ... ఆ రోజునుంచీ మొదలయ్యాయి వాడికి కష్టాలు.

రోజూ కిరణ్‌గాడికి వాళ్ళమ్మ ఓ పెన్ను ఇవ్వడం, వాడుసాయంత్రం అయ్యేసరికి దాన్ని పారేసుకు రావడం, ఇంట్లోతిట్లు తినడం సర్వసాధారణమైపోయింది.

కొత్తపెన్ను జేబులో పెట్టుకుని స్కూలుకి పరిగెత్తు కుంటూ వస్తాడు కిరణ్‌గాడు. ఆ పెన్ను వాడి జేబులో పట్టనంటుంది.ఎగిరెగిరి పడుతుంది. వాడు గట్టిగా నొక్కిపెట్టి పట్టిస్తాడుజేబులో. ఓ పదిసార్లు కిందబడి, మీదబడి మొత్తంమీద స్కూలుకి తీసుకెడతాడు దాన్ని. అలా కిందపడ్డ పదిసార్లలో ఏ ఒక్కసారీ వాడు చూసుకోకపోయినా ఇక ఆరోజుకి వాడిపెన్ను పోయినట్టే.

బహుశా అది ఆలోచించే కాబోలు కిరణ్‌వాళ్ళమ్మ అక్కడికీ ఓసారి జేబులోంచి పెన్ను జారకుండా, చొక్కాగుండీకి గట్టిదారంతో కట్టింది. ఆరోజు సాయంత్రం కిరణ్ ఎప్పుడూలా మొఖం వెళ్ళాడేసుకొచ్చాడు.

''ఏంట్రా అలావున్నావ్! ఇవాళ కూడా పోయిందాపెన్ను?'' అడిగింది వాళ్ళమ్మ.

తల అడ్డంగా వూపాడు లేదన్నట్టు.



సెల్ఫ్ సర్వీసు

కష్టమర్: టేబిల్స్ శుభ్రం చేయించు సర్వర్!

సర్వరు : ఎవరిసీట్లో వాళ్ళే కూర్చునుండాలి కంగారైతే సెల్ఫు సర్వీసు చేసుకోవటమే.

మాదిరాజు పల్లంరాజు, వనంపల్లి

"మరెందుకలా ముఖంపెట్టావ్?" అంటూ చొక్కాకేసి చూసి "అవునూ గుండీకి కట్టానుకదా- అసలు చొక్కా గుండీయే కన్పించదే" స్వరం పెంచి అడిగింది వాళ్ళమ్మ శాంత.

"పీకేసాను" అన్నాడు నసుగుతూ.

"అదేవిటి"

"నువ్వేమో గుండీకి దారం కట్టావా- బళ్ళో అందరూ అదిచూసి నవ్వుతున్నారమ్మా - ఆ తాడు పట్టుకు లాగుతున్నారు. నేను చూడకుండా వున్నప్పుడు. అందుకే పీకేసాను. ఇంకనేనెప్పుడూ దారంకట్టుకుని బడికెళ్ళనమ్మా' ' చెప్పేసాడు వాడు ఖరాఖండీగా...

"అయ్యో... మాబాబే... పెన్నుకి దారం కట్టుకు వెళ్ళడం నామోషీ, కాని రోజుకో పెన్ను మాత్రం పారేస్తాడు. మొహం చూడు మొహం" అంది వ్యంగ్యంగా... కిరణ్‌గాడు మాట్లాడలేదు. మూతి బిగించుక్కూర్చున్నాడు.

"సరిసరి ఇట్రా స్నానం చేద్దూగానింక" పిలిచింది వాళ్ళమ్మ.

పుస్తకాలు వాడి అరలో పెట్టుకుని దగ్గరకొచ్చి నిల్చున్నాడు వాడు.

స్నానం చేయించడానికి చొక్కా గుండీలు విప్పుతూ అనునయంగా చెప్పిందిశాంత.

"ఒరేయ్ కిరణ్- నీకు రోజుకొక కొత్తపెన్ను ఇస్తున్నానా లేదా?"

బుర్రవూపాడు వాడు ఇస్తున్నారన్నట్లుగా.

"నువ్వు ఇంచుమించు రోజుకొకటి పారేస్తున్నావా లేదా?" అంది.

ఒక్కక్షణం ఆలోచించి చిన్నగా తలపూపాడు అవునూ కాదూ అన్నట్లు.

"మరి నీలాగే మీస్కూల్లో అందరూ పెన్నులు పారేస్తున్నారా ఎక్కడైనా- అందరూ జాగ్రత్త పెట్టుకోవడం లేదూ? అసలు ఇన్ని పెన్నులు ఎవరికైనా పోతున్నాయా?' 'అంటూ వాడికి నచ్చజెప్పబోయింది శాంత వాడి ఒంటికి సబ్బురాపస్తూ.

"లేదమ్మా ఆ వంశీగాడివీ పోతున్నాయ్. వాడు రోజుకొక కొత్తపెన్ను తెస్తాడమ్మా... ఇవ్వాళైతే రెండురంగులు రాసే పెన్ను తెచ్చాడు. కొత్తబ్యాగు కూడా పట్టు కొచ్చాడమ్మ" చెప్పాడు వాడు.

"ఆ... ఆ... తెస్తాడు తెస్తాడు లంచాలు బాగా వస్తుంటే తేకేం చేస్తాడు."

"లంచాలేంటమ్మా! ఎవరికి వస్తున్నాయి?"

"వాళ్ళ నాన్నకే... బాగా బల్లకింద చెయ్యిపెట్టడ అలవాటైపోయింది."

"బల్లకింద చెయ్యి పెట్టడమంటే" అడిగాడు కిరణ్ ఒంటిమీద నీళ్ళు పోసుకుంటూ.

నిట్టూర్చింది వాళ్ళమ్మ ఏంచెప్పాలో అర్థంగాక. కాసేప వూరుకొని "అన్ని విషయాలూ నీకే కావాలి... అయినా ఆ వంశీగాడితో నీకు పోలికేంటి? వాడితో అట్టే తిరగకు వాడుట్టి జులాయి వెధవ... పొగరుబోతు" అంది.

"వంశీ పొగరుబోతా? మరి వాళ్ళమ్మొచ్చినపుడ వంశీ ఎంతో మంచి పిల్లాడన్నావు!"

"వూరకనే అలా అన్నాను - మర్యాదకు" అంది.

"ఓహో తెలిసింది" అని, కొద్దిసేపటి తర్వా "మర్యాదంటే అబద్ధాలాడటమా అమ్మా" అన్నాడ కిరణ్‌గాడు.

గతుక్కుమందిశాంత. "నీతో ప్రతిదీ తలనెప్పె లాయరు బుద్ధులూ నువ్వూను. ఇక పద ఒళ్ళు తుడుచుక ' అంటూ రెక్కపుచ్చుకొని బయల్దేర దీసింది వాళ్ళమ్మ

★ ★ ★

వెలుతురు బాగా తగ్గిపోవడంతో పిల్లలంతా ఆట మానేసి ఒక్కక్కరే ఇళ్ళకు బయల్దేరారు. కిరణ్‌గా మాత్రం బిక్కు బిక్కుమంటూ ఆ చీకట్లోనే ఒంటరి కూర్చున్నాడు. వాడికి ఇంటికి వెళ్ళాలంటే భయం వుంది ఎక్కడ అమ్మ తిడుతుందేమోనని.

అమ్మ పొద్దున్న పెన్ను ఇచ్చేప్పుడే చెప్పింది "ఇ నాన్నగారు ఎమ్మే పరీక్షలు రాసినపెన్ను. పారేసావా లేదు వీపు చీరేస్తానంతే" అంటూ వార్నింగ్ ఇచ్చింది.

స్కూలుకి వెళ్ళేముందు మళ్ళీ "నాన్నగారు గుర్తు వుంచుకున్న పెన్నిది. పారేసావా ఇంట్లోకి రానిచ్చే లేదు" అని చెప్పింది.

ఇప్పుడా పెన్ను పోయింది.

అందుకే వాడు భయపడుతున్నాడు ఇం వెళ్ళడానికి జంకుతున్నాడు. అసలు వాడు కూ ఇన్నిపెన్నులు పారేస్తున్నందుకు బాధపడుతున్నా ఒక్కసారిగా తను పారేసిన పెన్నులన్నా దొరికిపోయే

చెయ్యిదేవుడూ' అని దండంకూడా పెట్టేస్కున్నాడు మనసులో

కాసేపటికి పూర్తిగా చీకటిపడటంతో గ్రౌండులో చివరగా క్రికెట్ ఆడ్తోన్న పదోతరగతి పిల్లలుకూడా ఇళ్ళకి బయల్దేరారు.

చేసేదిలేక ఒక్కడూ ఉండడానికి భయమేసి వాళ్ళవెనకాలే బయల్దేరాడు కిరణ్‌గాడు. వాడు ఇక ఇంటికెళ్ళకూడదని నిర్ణయించేస్కున్నాడు.

స్కూలు గేటు ఎరకూరాగానే గేటులోంచి కిరణ్‌గాడి చినమామయ్య వస్తూ కన్పించాడు.

వెంటనే గేటు పక్కగా ఉన్న ఆశోకచెట్లచాటున నక్కాడు కిరణ్. చినమామయ్యంటే కిరణ్‌వాళ్ళమ్మకి చిన్నతమ్ముడు. కిరణ్‌చదివేస్కూల్లోనేపదోక్లాసు చదువుతున్నాడు. చెట్టుచాటునుంచి మామయ్య ఏం చేస్తాడా అని చూస్తున్నాడు కిరణ్.

"మా కిరణ్‌గాడు కన్పించాడేంట్రా" అంటూ తన స్నేహితుల్ని అడుగుతున్నాడు.

వాళ్ళు లేదంటున్నారు.

"ఇంట్లో అంతా కంగారు పడుతున్నారు. మీ కెవరికైనా కన్పిస్తే వెంటబెట్టుకుని తీసుకొచ్చేయండి" అని చెబుతున్నాడు.

"దొంగ వెధవ, వాడిదగ్గరున్న వాటర్‌కలర్స్ ఒక్కసారి ఇమ్మంటే ఇవ్వడుగానీ కిరణ్‌గాడొచ్చాడేంట్రా అంటూ అడుగుతున్నాడు చూడూ" అనుకున్నాడు కిరణ్ చెట్టుబాటు నుండి.

అంతా వెళ్ళిపోయాక చెట్టుబాటునుంచి బయటకి వచ్చి కనుచూపు మేరలో వాళ్ళని ఫాలోచేస్తూ నడుస్తున్నాడు.

కిరణ్‌వాళ్ళ అమ్మమ్మదీ, తాతయ్యదీకూడా అదేవూరు కావడంతో సహజంగా అప్పుడప్పుడూ అక్కడికి వెడుతుంటాడు కిరణ్.

ఈ ఆలోచన వచ్చిన మరుక్షణం తన స్నేహితుల్ని తలోదిక్కుకి వెతకడానికి పంపి, తనూ ఒక్కసారి ఇంటికేసి బయల్దేరాడు కిరణ్‌వాళ్ళ మామయ్య.

అసలు తను కనపడటం లేదంటే అందరూ కంగారు పడుతున్నారా? సరే, ఏం చేస్తున్నారో చూద్దాం అని, మామయ్యని అతడికి తెలియకుండా అనుసరించాడు కిరణ్.

ఇంటి వరకూ వెళ్ళాక మామయ్యని లోపలికి పోనిచ్చి తను బయట నైట్‌క్వీన్ బెట్టుకింద కన్పించకుండా నించున్నాడు. అమ్మమ్మా తాతయ్యా ముందు వరండాలో ఉన్నారు.

"అయ్యో బిడ్డ ఎటుపోయాడో - వాడ్నింకా ఈరోజు ఇంటికి తీసుకురమ్మని నీతో చెబుదామనుకున్నానా- వాడి కిష్టమని 'జున్ను' వండాను - ప్చ్... ఎటు వెళ్ళాడో ఏంటో" అంటూ బుగ్గలు నొక్కుకుంటూ దీర్ఘాలు తీస్తోంది కిరణ్‌గాడి అమ్మమ్మ.

అవిణ్ణీ పూర్కోమని, ఇంకా ఎక్కడెక్కడ వెతకాలో చిన్నకొడుక్కి చెబుతున్నాడు కిరణ్‌తాతయ్య.

ఇక్కడ కిణ్‌గాడికి మాత్రం 'జున్నే' గుర్తుకొస్తోంది.

"ఇప్పుడేమో ఇలా అంటుందా జున్ను చేసానని - నేను అంతా తినేస్తానంటే మాత్రం 'వాతం' చేస్తుందని చెప్పి, దాచేస్తుంది" అనుకున్నాడు.

తాతయ్యమాత్రం మొన్న కత్తిపడవ చేసుకుందామని గూట్లోపేపరు చింపుకున్నానా - 'కొత్తపేపరు చింపేస్తావురా భడవకానా' అంటూ తిట్టాడు అనుకున్నాడు.

ఇక ఇక్కడుంటే లాభం లేదనుకుని మెల్లిగా చప్పుడు చేయకుండా బయటికి వచ్చి ఇంటికేసి బయల్దేరాడు ఆలోచిస్తూ, అప్పటికే టైము పదిగంటలు దాటింది.

ఇల్లు దగ్గరపడగానే మెల్లగా నక్కినక్కి గేటు పక్కనుంచి లోపలికి చూసాడు కిరణ్. తలుపులన్నీ బోర్లాతెరిచి వున్నాయ్. లైట్లన్నీ వేసి వున్నాయ్. ఇంట్లో ఎవరూవున్న అలికిడి లేదు.

పిల్లిలా లోపలికి దూరాడు కిరణ్. ముందుగది దాటి బెడ్రూము దాటి, వంటగదిలోకి తొంగిచూసాడు. అమ్మ స్టవ్‌మీద పాలుమరగబెడుతోంది.

"ఏంటో పిచ్చివెధవ ఎక్కడికి పోయాడో ఏంటో - పెన్నులు పారేస్తున్నాడని ఏవన్నా అంటానని భయపడ్డాడో ఏంటో - వెతకడానికెళ్ళిన ఈయనా అలుపులేరు" అనుకుంటూ బయటికే మాట్లాడేస్తోంది.

అమ్మకి కన్పించకుండా ప్రక్కనేవున్న నడవాలోని పాతమంచాల చాటున దూరాడు కిరణ్. అమ్మ మాటలన్నీ వింటున్నాడు. ఇంతలో అమ్మ వీధిలోకి వెళ్ళి ఒక్కసారి చూసి తిరిగి వంటింట్లోకి వచ్చింది. పాలగిన్నె దింపేసి స్టవ్ ఆర్పేసింది.

మళ్ళీ ఇంట్లోకి వీధిలోకి రెండుసార్లు తిరిగింది కాలుగాలిన పిల్లిలా. తననింట్లో వుంచేసి వెతకడానికి వెళ్ళిన వాళ్ళింకా రాకపోవడంతో కంగారెక్కువైందామెకు.

ఇదంతా కిరణ్‌గాడు గమనిస్తూనే ఉన్నాడు. వాడికి ఆశ్చర్యంగా వుంది. తను పెన్ను పారేసినపుడు కోప్పడే అమ్మేనా ఇలా ఏడుస్తోంది అనుకున్నాడు.

అమ్మ ఏడుపు చూస్తూంటే వాడికి బాధేసింది. బయటకి వచ్చేద్దామనుకున్నాడు. ఇంతలో కిరణ్ వాళ్ళ నాన్న వచ్చాడు.

అతను లోపల అడుగెట్టాడో లేదో ఎదురెళ్ళి 'ఏవండీ కన్పించాడా?" అంటూ అడిగింది కిరణ్ వాళ్ళమ్మ.

"లేదు శాంతా... చందూఇంకా కొంతమంది కల్సికిరణ్‌గాడి పాతఫ్రెండ్స్ ఇళ్ళకి వెళ్ళి చూస్తామన్నారు. మామయ్య స్కూలుకివెళ్ళి ఒకసారి క్లాసరూం తలుపులు తెరిపించి చూసొస్తామన్నారు" చెబుతున్నాడాయన బాధగా.

"అదేంటండీ" అంటూ కిరణ్ అమ్మ ఏడ్వసాగింది.

"ఛ ఛ... ఏడవకు పూర్కో పూర్కో నేనెళ్ళి పోలీస్ రిపోర్టిచ్చివస్తాను - నువ్వు మాత్రం ఇక్కడేవుండు, వాడిక్కడికి వస్తేమాత్రం పోలీస్ స్టేషన్‌కి కబురుపెట్టు వెంటనే" అంటూ హడావిడిగా వెళ్ళిపోయాడు కిరణ్ వాళ్ళ నాన్న.

ఇదంతా మంచం చాటునుంచి చూసిన కిరణ్, నాన్నముఖంలో విచారం గమనించకపోలేదు.

"మరి నేనొకసారి, ఎక్వేరియంలో చేపలకి అన్నమెవరం పెట్టట్లేదని, దోసెముక్కలు నీళ్ళల్లో వేస్తేఎందుకు తిట్టారు" అనుకున్నాడు.

అయినా వాడికి ఇదంతా చూస్తూంటే భయంగా వుంది. వింతగా వుంది. ఒకవిధంగా అమ్మ ఏడుపు చూస్తుంటే వాడికీ ఏడుపు వస్తోంది. అమ్మ ఎక్కడుందాని చూశాడు.

ఎదురుగా వెంకటేశ్వరస్వామి పటం ముందు నిలబడి ఏడుస్తూ "భగవంతుడా! మా కిరణ్‌గాడు క్షేమంగా ఇల్లు చేరేలా చూడుతండ్రీ - నీకు మావారి చేత తలనీలాలు ఇప్పిస్తాను స్వామీ" అంటూ దండాలు పెట్టేస్కుంటోంది.

అప్పుడు కిరణ్‌గాడికి ఏడుపొచ్చేసింది. అయితే అమ్మకి నేనంటే ఇష్టమేనన్నమాట. అలాగే నాన్నకీ, తాతయ్యా వాళ్ళకి కూడా. మరి, అప్పుడప్పుడూ వాళ్ళెందుకు తిడుతుంటారో అప్పటికి అర్థం కాకపోయినా ఇక ఆగలేక పోయాడు.

వెంటనే మంచంచాటు నుంచి బయటికి వచ్చి అమ్మవెనకాలగా నిలబడ్డాడు. అమ్మ ఇంకా దేవుడి పటం ముందు నిలబడి ఏడుస్తోంది.

"అమ్మా!" పిలిచాడు.

గిర్రున వెనక్కితిరిగి చూసిందమ్మ నమ్మలేనట్టు. ఒక్కసారిగా వంగి కిరణ్‌ని గట్టిగా హత్తుకుంది ఏడుస్తూ.

"కిరణ్ ఎటుపోయావురా... ఎటుపోయావు ఇప్పటివరకూ... నీ కోసం నేనెంత తల్లడిల్లిపోయానో తెలుసా" అంటూ మాట్లాడుతూనే చిన్నగా చెంపమీద రెండువేసింది. అంతలోనే మళ్ళీ హత్తుకుని ముద్దు పెట్టుకుంది.

కిరణ్‌గాడికి కోపం రాలేదు అమ్మకోప్పడినా ఎప్పటిలా ఏడుపురాలేదు. ఇది నా సొంతం అన్నట్టు అమ్మఒడిలో ఒదిగిపోయాడు గువ్వలా. పటంలో దేవుడు నవ్వాడు. అమ్మఒడిలో కిరణ్‌గాడూ నవ్వాడు.

వి.ఎస్.రవిచంద్ర
9/30, శాంతినగర్,
చోడవరం - 531 036.
విశాఖ జిల్లా.